**పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్య దారుణం.**
రక్షణ కల్పిస్తూ ప్రత్యేక పోలీస్ నోడల్ అధికారిని ప్రతి జిల్లాలో నియమించాలి.:నిజామాబాద్ నగరంలో ట్రస్మా నిరసన ర్యాలీ.
4లో

RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

**ఆటోడ్రైవర్ల బంద్ కు సంపూర్ణ మద్దతు.**
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత.
3లో

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 278 మంగళవారం 25 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-

## అప్పటివరకూ రాజకీయ సన్యాసం తీసుకోను : మమతా బెనర్జీ

బీజేపీ ప్రభుత్వంపై మమత నిప్పులు
జనాభా లెక్కల ప్రక్రియపై మమతా ప్రశ్నలు
అనర్హత పేరుతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తోంది



తాను రాజకీయ సన్యాసం తీసుకునే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీని కనుమరుగు చేసేంతవరకు తాను విశ్రమించబోనని ఆమె చెప్పారు. ప్రభుత్వం మారిన నాలుగు నెలల్లోనే రాష్ట్ర ప్రజలు బీజేపీ అసలు స్వరూపాన్ని అర్థం చేసుకున్నారని మమతా ఫేస్‌బుక్ లైవ్‌లో అన్నారు. ఈ సందర్భంగా ఆమె జనాభా లెక్కల ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తారు. జాతీయ పౌర పట్టిక (చీ=జ)ని అమలుకు ఇది మరో రహస్య ప్రయత్నమని ఆరోపించారు. రాజకీయ పార్టీలను సంప్రదించకుండా అమలు చేశారన్నారు. జనాభా లెక్కల ఫారాలపై సంతకాలు చేసే ముందు, వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసే ముందు ప్రజలు జాగ్రత్త వహించాలని కోరారు. 2లో

## ఎల్ నినో గండం...
# గట్టెక్కినట్లేనా




తీవ్ర వర్షాభావ పరిస్థితులతో దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతలకు తుపాను ముసురు కొండంత ఊరటనిచ్చింది. ఎల్ నినో ప్రభావంతో గత కొద్దిరోజులుగా వర్షాలు ముఖం చాటేయడం, ఎండల తీవ్రత పెరగడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ఈ దశలో ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న ముసురు జల్లులు మండలంలోని పంట పొలాలకు పునర్జీవనం పోశాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అరకొర వర్షాలతో రైతులు వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు. అయితే సరైన సమయానికి వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీటి ప్రవాహం తగ్గడంతో పంటలు నిలువునా ఎండిపోయే పరిస్థితి దాపురించింది. పెట్టుబడులు సైతం దక్కవేమోనని రైతులు తీవ్ర ఆందోళనలో కూరుకుపోయారు. సరిగ్గా ఇలాంటి విపత్కర సమయంలో తుపాను ప్రభావంతో ప్రారంభమైన ముసురు వాన పంటలకు అమృతంలా మారింది. ఏకధాటిగా కురిసే భారీ వర్షాల కన్నా, ఇలా నేలను తడుపుతూ నిదానంగా కురిసే ముసురు వల్ల తేమ ఎక్కువ కాలం నిలిచి పంటల ఎదుగుదల కు ఎంతగానో దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు.

నిరంతర జల్లులతో నేలంతా తడిసి ముద్దవడంతో చేలల్లో తేమ శాతం పెరిగింది. దీంతో బోరుబావులపై ఆధారపడాల్సిన అవసరం తాత్కాలికంగా తగ్గింది. పత్తి చేలలో పూత, కాత రాలకుండా ఈ తేమ రక్షణగా నిలుస్తుందని, ఎండిపోతున్న వరి పైర్లు తిరిగి పచ్చదనాన్ని సంతరించుకుం టాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పంటల పెట్టుబడి చేతికందే కీలక తరుణంలో ఈ వర్షం పడటం రైతులకు పెద్ద ఊరటనిచ్చింది. వానలు ఇలాగే మరో రెండు మూడు రోజులు కొనసాగితే చెరువులు, కుంటల్లోకి నీరు చేరడంతో పాటు భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి యాసంగి సాగుకు కూడా మార్గం సుగమమవుతుందని మండల రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. వర్షాలు లేక ఎండలు ముదరడంతో వేసిన పత్తి, వరి చేలు ఎండిపోతాయేమోనని తీవ్ర ఆందోళన చెందాం. బోరు బావుల్లో కూడా నీళ్లు తగ్గిపోవడంతో పెట్టిన పెట్టుబడులు పోతాయని భయపడ్డాం.

సరిగ్గా ఇలాంటి సమయంలో వచ్చిన ముసురు వాన పైర్లకు ప్రాణం పోసింది. నిదానంగా కురిసిన జల్లులతో నేలలో తేమ బాగా నిలిచింది. ఈ వర్షాలు మరో రెండు రోజులు కొనసాగితే పంటల ఎదుగుదల మరింత బాగుంటుంది, ఈ సారి గట్టెక్కుతామనే ధైర్యం వచ్చింది.

## సీజేపీ సంచలన ప్రకటన..
# మళ్లీ ఢిల్లీలో నిరసనలు
## కేంద్రానికి స్ట్రాంగ్ వార్నింగ్!




నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రం విఫలమైందని ఆరోపిస్తూ.. కాక్రోచ్ జనతా పార్టీ మరోమారు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 5న దేశ రాజధాని ఢిల్లీలో మరోమారు శాంతియుత నిరసనలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబర్ 5న ఢిల్లీలోని చారిత్రాత్మక ఇండియా గేట్ వద్ద ప్రారంభమయ్యే ఈ శాంతియుత ర్యాలీ.. అక్కడి నుంచి న్యూఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు కొనసాగుతుందని తెలిపింది. దేశంలోని యువత, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా కేంద్రంపై సీజేపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. 'ఒక తరం నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని, వారిని ఇళ్లకు పంపించేసి, ఆ తర్వాత ఇచ్చిన మాట నుంచి ప్రభుత్వం సైలెంట్‌గా వెనక్కి తగ్గడం ఎంతమాత్రం సరికాదు. ఇచ్చిన మాటను దాటవేసే ఈ నమ్మకద్రోహాన్ని మేము ఏమాత్రం సహించబోము' అని పార్టీ స్పష్టం చేసింది. ఈసారి చేపట్టబోయే నిరసనలను బాధితులే ముందుండి నడిపిస్తారని సీజేపీ వెల్లడించింది. నీట్ పేపర్ లీకేజీ కారణంగా తమ పిల్లలను, వారి భవిష్యత్తును కోల్పోయిన కుటుంబాలు, అలాగే పోలీసుల దౌర్జన్యాలకు గురైన బాధితులు స్వయంగా ఈ మార్చ్‌కు నాయకత్వం వహిస్తారని పార్టీ తెలిపింది. న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేసింది. 2లో

## తమిళనాడు అసెంబ్లీలో..
# సీఎం విజయ్ సంచలన ప్రకటనలు



తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్.. అసెంబ్లీ వేదికగా కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. పేద కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించనున్నట్లు తెలిపారు. అలాగే రైతుల వ్యతిరేకతతో. పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో. ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని వెట్రి పయనం పేరుతో విస్తరించారు. వచ్చే అక్టోబర్ 2 గాంధీ జయంతి నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుంది. 2లో

# ప్రధానిపై సీఎం రేవంత్ ఫైర్
## గుజరాత్‌కు ఓ న్యాయం.. తెలంగాణకు మరో న్యాయమా?



రాజకీయ కారణాలతోనే తన అమెరికా పర్యటనను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ కు చేరుకున్న రేవంత్.. సచివాలయంలోని మీడియా హాల్ లో మాట్లాడారు. కేంద్రం ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి అమెరికా పర్యటనను తిరస్కరించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఏ విధమైన కారణాలతో తన పర్యటన తిరస్కరించాలో ప్రధాని మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల గుజరాత్ ముఖ్యమంత్రికి అమెరికా వెళ్లేందుకు అనుమతించిన విషయాన్ని సీఎం రేవంత్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ రాష్ట్ర సీఎం భూపేంద్రభాయ్ పటేల్ కెనడా, అమెరికా వెళ్లినట్లు పేర్కొన్నారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని అమెరికన్ కంపెనీలను కోరారని అన్నారు. తాను కూడా పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా పర్యటన షెడ్యూల్ చేసుకుంటే మాత్రం కేంద్రం అనుమతి నిరాకరించిందని మండిపడ్డారు. ఇంగ్లాండ్ కు ఏవి ఇచ్చామో అమెరికాకు కూడా అవే అనుమతి పత్రాలను సమర్పించినట్లు రేవంత్ తెలిపారు. ఇంగ్లాండ్ కు ఓకే చెప్పి.. అమెరికాకు నో ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. 2లో

# నామినేటెడ్ పదవుల భర్తీపై...
## కీలక ప్రకటన చేసిన టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్!



ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన అప్పటి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్యమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు 80 శాతం నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకే రాజకీయ వ్యవహారాల (పిఎసి) కమిటి సమావేశం ముఖ్య ఉద్దేశమని పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో నీ వినాయక ఫంక్షన్ హాల్ లో మెదక్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ పిఎసి సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమంలో..

ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మైనంపల్లి,రోహిత్ రావు,మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఆంజనేయులు గౌడ్,ఆంక్షరెడ్డి,ఆవుల రాజిరెడ్డి,చెరుకు శ్రీనివాసరెడ్డి,లు తదితరులు హాజరయ్యారు. 2లో

## ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి శుభవార్త..

హైదరాబాద్ క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ నెల 25వ తేదీన లాటరీకి అర్హత సాధించినవారి వివరాలను హౌసింగ్ బోర్డు ప్రకటించింది. ఆగస్ట్ 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు లాటరీ తీసి నియోజకవర్గాల వారీగా ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 16 నియోజకవర్గాల నుంచి అర్హులైనవారి నుంచి దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించింది. 60,720 మంది దరఖాస్తు చేసుకోగా.. ప్రాథమిక పరిశీలన అనంతరం అనర్హులుగా తేలినవారికి నోటీసులు అందించారు. వీరి నుంచి సోమవారం వరకు అభ్యంతరాలు స్వీకరించారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
మంగళవారం
25 -08-2026

## సంపాదకీయం

# సారహీనమైన ప్రసంగం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా భారతదేశం నక్సలిజం నుండి విముక్తి పొందిందని మార్చి 31, 2026న పార్లమెంటులో ప్రకటించారు. ఆగస్టు 15న ఎర్రకోట నుండి చేసినబి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోడి అవే మాటలు పునరుక్తం చేసారు. ఈ మధ్యలో ఉన్న నాలుగు నెలల్లో కొన్ని ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. అందులో మూడు ప్రధాన పరిణామాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఏప్రిల్, మే నెలల్లో దేశ ఉత్తర భాగంలో రగులుకున్న కార్మికుల నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన చారిత్రాత్మక విద్యార్థి-యువజన ఉద్యమం, బంకిపూర్ ఉపఎన్నిక. గత మూడు దశాబ్దాలుగా బిజెపి ఆధిపత్యంలో ఉండి, ఇటీవలే ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖాళీ చేసిన ఈ స్థానంలో బిజెపి భారీ ఓటమి చవిచూసింది. ఈ పరిణామాలు బిజెపిని ఆత్మరక్షణలో పడేసాయనడంలో సందేహం లేదు. బిమోడీ తన ప్రసంగంలో “దిమాగీ నక్సల్స్” (మేధో నక్సలైట్లు) ముప్పును ప్రస్తావించడాన్ని ఈ నేపథ్యంలోనే చూడాలి. సృజనాత్మకమైన ఆలోచనలు కరువైన కలవరపడే నాయకుడు గతంలో వాడిన వ్యూహాలు, ప్రకటనలపై ఆధారపడటం సహజం. “దిమాగీ నక్సల్” అనే ముద్ర గతంలో వాడిన “టుక్డే-టుక్డే గ్యాంగ్”, “అర్బన్ నక్సల్”, “ఆందోళన్ జీవి” వంటి లేబుళ్ల కొనసాగింపే. ఫాసిజం ఎల్లప్పుడూ ఆవేశపూరిత జాతీయ భావాలను తన శత్రువులకు వ్యతిరేకంగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తుంది. నయా-ఫాసిస్ట్ లక్షణాలు కలిగిన ప్రస్తుత ప్రభుత్వ వ్యూహాలు కూడా అందుకు భిన్నంగా లేవు. మెజారిటీ మత విభజన రాజకీయాలు ఇప్పటికీ గణనీయమైన స్థాయిలో ప్రజలపై ప్రభావం చూపుతున్నప్పటికీ, నీట్ (చీజుజు) పేపర్ లీక్‌పై జరిగిన ఐక్య నిరసనలు, ప్రస్తుత పరిస్థితులపై ముఖ్యంగా యువతరంలో పెరుగుతున్న అసంతృప్తి ముందు అటువంటి విభజనవాద రాజకీయాల పరిమితులను స్పష్టం చేసాయి.

ప్రధాన మంత్రి ప్రసంగంలో చేసిన భారీ వాగ్దానాలు ఈ అసంతృప్తిని పరిష్కరించడానికి ఏమాత్రం కొరగాకుండా పోయాయి. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తామని ప్రకటించిన మరుసటి రోజే, “అనేక అవాస్తవ, ముద్రణ, అనువాద పొరపాట్లు, అలాగే గతంలో ఇచ్చిన ప్రశ్నలు మళ్లీ రావడం” కారణంగా యుజిసి-నెట్ లోని మూడు పేపర్లను తిరిగి నిర్వహిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నోటిఫై చేసింది. పరీక్షల వ్యవస్థపైనే నమ్మకం లేనప్పుడు, ప్రతి పరీక్షా లీకులు, పొరపాట్లు, రద్దులు, పునఃపరీక్షల నిర్వహణతో కొట్టుమిట్టాడుతున్నపుడు చౌకగా కోచింగ్ కల్పిస్తామన్న హామీ అర్థరహితమని విద్యార్థి లోకం సరిగానే ఎత్తి చూపింది. నూతన విద్యా విధానం (చీజ్యూ) విజయం సాధించిందని మోడి ప్రకటించిన అదే రోజున, పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లా ఇందాస్ పరిధిలోని కరిషుండా గ్రామంలో బిజెపి గూండాలు జరిపిన క్రూరమైన దాడిలో గాయపడిన షేక్ మహమ్మద్ మాఫిక్ మరణించారు. అతని కుమారుడు అబ్దుల్ హాఫీజ్ జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థి ఉద్యమంలో పాల్గొని, తమ గ్రామీణ పాఠశాలలోని సౌకర్యాలపై సిటిజన్ ఆడిట్ చేయడానికి ప్రయత్నించినందుకే మహమ్మద్ మాఫిక్‌ను దాడికి లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 94,000 కంటే ఎక్కువ ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని (రోజుకు సగటున 25 పాఠశాలలు), అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 2.26 కోట్ల మేర తగ్గిందని ఇటీవల నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంగీకరించడానికి నిరాకరిస్తున్న చీజ్యూ 2020 వైఫల్యాన్ని ఇది స్పష్టం చేస్తోంది. వారు ఇప్పుడు ‘వన్ డే, వన్ యూనివర్సిటీ’ పేరుతో జెన్-జీ (+వఖ్ఖ)ను చేరువ చేసుకునేందుకు ప్రయత్నించవలసి వచ్చింది. తద్వారా ప్రతి కేంద్ర మంత్రి ప్రతిరోజూ ఒక విశ్వవిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను విని, యువజన సంక్షేమ పథకాలను వివరిస్తారు. అయినప్పటికీ, మన విద్యను వ్యాపారీకరించడానికి, కేంద్రీకరించడానికి, కాషాయమయం చేయడానికి ప్రయత్నిస్తున్న చీజ్యూ లోనే సమస్య ఉందనే విషయాన్ని వారు అంగీకరించడం లేదు. ఇది కోచింగ్ సెంటర్ల పుట్టగొడుగులా పెరగడానికి, పేపర్ లీకులు, లోపభూయిష్ట పరీక్షల వంటి సమస్యలకు దారితీసింది. చీజ్యూ ని రద్దు చేస్తే తప్ప మన విద్యార్థులకు న్యాయం జరగదు. తగిన ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు స్పష్టమైన ప్రయత్నాలు జరిగే వరకు భారతీయ యువతకు కూడా న్యాయం దక్కదు. తన ప్రసంగంలో మోడీ మహిళా రిజర్వేషన్ చట్టం ఆమోదం పొందడాన్ని ప్రశంసించారు, ఆపై పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీలలో ఇది అమలు జరిగేలా చూసే బాధ్యతను ప్రతిపక్షాలపై నెట్టారు. అయితే దీనికి తన ప్రభుత్వమే ఆటంకంగా ఉందనేది అందరికీ తెలిసిందే. జూలై 20 నుండి ఆగస్టు 13 వరకు జరిగిన వర్షాకాల సమావేశాల సమయంలో, వేలాది మంది మహిళలు జంతర్ మంతర్ పరిసరాల్లో నిరసన తెలిపారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసారు. మహిళా రిజర్వేషన్ల జాతీయ కూటమి ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, పౌరసమాజ బృందాలు వివిధ రాజకీయ పార్టీలను కలవగా, ఈ అంశానికి మద్దతు ఇస్తామని హామీ లభించింది. అయినా బిజెపి పట్టించుకోవడం లేదు. వారికి ఈ చట్టం నియోజకవర్గాలను మార్చడానికి, తమకు అనుకూలంగా ఎన్నికల చిత్రపటాన్ని మార్చుకోవడానికి ఒక నెపం మాత్రమేనని స్పష్టమవుతోంది. బిరైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసామని, అవకాశాలు కల్పించామని మోడీ చేసిన ప్రకటనలు వాస్తవాలకు భిన్నంగా ఉన్నాయి. గత మూడేళ్లలో 32,000 మందికి పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోకు గణాంకాలు అందించిన రాష్ట్రాల లెక్కలు మాత్రమే ఇవి. ఎంతో గొప్పగా చెప్పుకునే విబి గ్రామ్ జి వల్ల గ్రామీణ ఉపాధి కల్పనలో 50 శాతం తగ్గుదల నమోదైనట్లు అధికారిక గణాంకాలు చూపుతున్నాయి. ఈ ఏడాది జూలైలో 68.94 లక్షల కుటుంబాలు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోగా, 7.67 కోట్ల పనిదినాలు అమలయ్యాయి . గత ఏడాది ఇదే నెలలో 1.42 కోట్ల కుటుంబాలు, 15.33 కోట్ల పనిదినాలు లభించినట్లు నమోదయ్యింది. బిపంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడం, విద్యుత్ సవరణ బిల్లుపై ఆందోళనలను పరిష్కరించడంపై రైతులకు ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం ఇంకా నిలబెట్టుకోలేదు. దానికి బదులుగా, రైతు సంఘాలతో సంప్రదించకుండానే రైతు ప్రయోజనాలకు హాని కలిగించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో ముందుకెళ్తోంది. ఇక కార్మికుల విషయానికొస్తే, మోడీ వారిని ప్రస్తావించడమే మానేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక అనుకూలమైనవనే బోలు వాదనలు ఈ ఏడాది ప్రారంభంలోనే పటాపంచలయ్యాయి. తమ హక్కుల కోసం కార్మికులు వీధుల్లోకి వచ్చి పోరాడారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పూరిళ్లు, కొండచరియలు విరిగిపడటం వల్ల ప్రభావితమైన కుటుంబాలకు “మొత్తం దేశం వారికి అండగా నిలుస్తుంది” అనే హామీ తప్ప ప్రధాని వారి పునరావాసానికి, తక్షణ సాయానికి ముందుకు వచ్చిందే లేదు. వారి బాధ, ఆవేదన తనకు అర్థమవుతుందని ఆయన చెప్పుకున్నప్పటికీ, దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు మాత్రం మోడీ కి జనం గురించిన పట్టింపు లేదనే భావిస్తున్నారు. బిజెపియేతర ప్రభుత్వాలు ఉన్న అనేక రాష్ట్రాలు వరదలు, కొండచరియలు విరిగిపడటం లేదా కరువు సమయంలో కోరిన నిధులలో చాలా స్వల్ప మొత్తాన్ని మాత్రమే కేటాయించడం ఇందుకు నిదర్శనం . నిధుల విడుదలకు విపత్తు తీవ్రత కాకుండా రాజకీయాలే కొలమానంగా మారాయి. 2018 నాటి తీవ్ర వరదల తర్వాత విదేశాల నుండి ఉదారంగా సహాయం అందించేందుకు ముందుకు వచ్చినప్పటికీ, విదేశీ సహాయాన్ని స్వీకరించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన విషయాన్ని కేరళ ప్రజలు మరిచిపోరు.

# హెచ్-1బీ వీసా కొత్త రూల్స్ రెడీ..




## ఫీజు లక్ష డాలర్లు పైనే.. జాబ్ పోతే తక్షణం దేశం వీడాల్సిందే!

అమెరికాలో ఉద్యోగం చేయాలని ఆశపడే విద్యార్థులు, ఐటీ నిపుణులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. హెచ్-1బీ వీసాతో పాటు ఎఫ్-1 ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్‌లపై కొత్తగా భారీ రుసుములను విధించేందుకు అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ కొత్త రూల్స్ ను రెడీ చేసింది. దీని ప్రకారం హెచ్-1బీ వీసా రుసుమును ఏకంగా 1,03,265 డాలర్ల కు పెంచే యోచనలో ట్రంప్ సర్కార్ ఉన్నట్లు సమాచారం.

**రూల్స్ మారితే ఎవరిపై ప్రభావం?**

కార్పొరేట్ ఇమ్మిగ్రేషన్ సేవల సంస్థ ఫ్రాగోమెన్ విశ్లేషణ ప్రకారం. ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే అమెరికాలో పనిచేస్తున్న విదేశీ నిపుణులు, చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాల్లో చేరాలని భావిస్తున్న విదేశీ విద్యార్థులపై దీని ప్రభావం పడనుంది. అలాగే వీరికి స్పాన్సర్‌షిప్ ఇచ్చే అమెరికన్ కంపెనీలపై కూడా విపరీతమైన విపరీతమైన ఆర్థిక భారం పెరగనుంది.

**భారతీయులపైనే తీవ్ర ప్రభావం**

అయితే ఈ మార్పుల వల్ల అత్యధికంగా భారతీ యులే నష్టపోనున్నారు. ఎందుకంటే మొత్తం హెచ్-1బీ వీసా లబ్ధిదారుల్లో 70 శాతానికి పైగా భారతీయులే ఉన్నారు. 2024 సంవత్స రంలో యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ మొత్తం 3,99,402 హెచ్-1బీ పిటిషన్లను ఆమోదించగా.. అందులో భారతీ య మూలాలు ఉన్నవారే 71 శాతం ఆమో దాలు పొందడం విశేషం.

**వైట్‌హౌస్ పరిశీలనలో ప్రతిపాదనలు**

ఫ్రాగోమెన్ అందించిన వివరాల ప్రకారం.. ఈ ప్రతిపాదనలను ఇప్పటికే వైట్‌హౌస్ ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ పరిశీలనకు వెళ్లింది. అప్లికేషన్లపై దాదాపు 1,00,000 డాలర్ల రుసుము విధించే ప్రతిపాదనను ఓపీటీ ఆగస్టు 20వ తేదీనే ఓఎంబీ సమీక్షకు పం పింది. కొన్ని రకాల హెచ్-1బీ పిటిషన్లపై కొత్త ఫీజు విధించే ప్రతిపాదనను ఆగస్టు 19నే పరిశీలించి ఆమోదించినట్లు ఫ్రాగోమెన్ పేర్కొంది. అయితే గతంలోనే హెచ్-1బీ ఫీజును లక్ష డాలర్లు చేయాలని ట్రంప్ సర్కార్ నిర్ణయించగా అమెరికన్ న్యాయస్థానం స్టే విధించింది. ఇప్పుడు మరోమారు ట్రంప్ సర్కార్ ఫీజు పెంచేందుకు రెడీ అవుతుండటం ఆసక్తి రేపుతోంది. అయితే ఈ ప్రతిపాదనల పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా బయటకు రావాల్సి ఉంది.

**60 రోజుల గ్రేస్ పీరియడ్‌కు స్వస్తి!**

కేవలం ఫీజుల పెంపే కాకుండా ఉద్యోగం కోల్పోయిన హెచ్-1బీ ఉద్యోగులకు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న 60 రోజుల ‘గ్రేస్ పీరియడ్’ రద్దు చేయాలని కూడా ప్రతిపాదించారు. ఈ నిబంధన అమల్లోకి వస్తే ఉద్యోగం ఊడిన వెంటనే బాధితులు వారి డిపెండెంట్లు ఎలాంటి సమయం లేకుండా తక్షణమే అమెరి కాను విడిచి వెళ్లాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం కంటే ముందే ఉద్యోగం పోతే.. అక్కడ ఉండటం చట్టవిరుద్ధంగా పరిగణించనున్నారు. ప్రస్తుతం అమెరికాలో 52 లక్షలకు పైగా భారతీయ మూలాలున్న ప్రజలు నివసిస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఈ కొత్త ఇమ్మిగ్రేషన్ నిబంధనలు అమలులోకి వస్తే వారిపై ఇది తీవ్రమైన ప్రభావం చూపనుంది.

# నామినేటెడ్ పదవుల భర్తీపై... కీలక ప్రకటన చేసిన టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్....

**మహేష్ కుమార్ గౌడ్..**

ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టపడ్డ కాంగ్రెస్ పార్టీ నాయకుల కు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని తాను, సీఎం రేవంత్ రెడ్డి డిల్లీ వేదికగా కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గాన్ని ఒప్పించి సహకార సంఘాల అధ్యక్షు లు,డైరెక్టర్ పోస్టుల ను నామినేట్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పి సి సి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు.బి ఆర్ ఎస్ పార్టీ కి వ్యతిరేకంగా పోరాటం చేసిన అప్పటి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఇతర ముఖ్య నాయకులకు 80 శాతం నామినేటెడ్ పదవులు ఇవ్వనున్నట్లు వేదికపై ప్రకటించారు.

**20% 80% పదవులు..**

నామినేటెడ్ పదవులు ఎమ్మెల్యేలు సూచించిన కార్యకర్తలకు 20% 80% పదవులు అప్పటి కష్టపడ్డ కార్యకర్తలకే దక్కే విధంగా చర్యలు తీసుకుంటామని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. మార్కెట్ కమిటీలు,దేవాలయ కమిటీలు, సహకార సంఘాల అధ్యక్షు పదవి తో పాటు,డైరెక్టర్ పోస్టుల ను త్వరలో నియమిస్తామని ప్రకటించారు. 60 రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులు భర్తీ చేశామని త్వరలోనే సంస్థ చైర్మన్ పోస్టులు డైరెక్టర్ పోస్టులు ఇతర ప్రభుత్వపరంగా నామినేట్ చేసే పదవులను 8 శాతం పదవులు పాత కార్యకర్తలకు ఇస్తామని ప్రకటించడంతో కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

**పదేళ్ల పాలనలో..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో ఏం చేశారో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలు, అవినీతి ప్రజలకు ఇంకా గుర్తున్నాయని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు, మార్ఫింగ్ వీడియోలు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మవద్దని సూచించారు.

**ఒకటో తేదీనే జీతాలు..**

ఉద్యోగులకు గత ప్రభుత్వ హయాంలో నెలలో 20వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు విషయంలో రైతులపై కేసులు పెట్టిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు.

**ప్రధాని నరేంద్ర మోదీ..**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపైనా మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్ని ఉద్యోగాలు కల్పించారో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగించారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటైన పలు కంపెనీలను అదానీ, అంబానీలకు అప్పగించారని విమర్శించారు.

**పేద పిల్లల కోసం..**

తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని, అర్హులైన పేదలు ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద పిల్లల కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

# అప్పటివరకూ రాజకీయ సన్యాసం తీసుకోను : మమతా బెనర్జీ

అలా చేయడం వల్ల వారి వ్యక్తిగత ప్రయోజనాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. మహిళల కోసం అందించే ‘అన్నపూర్ణ భండార్’ ఆర్థిక సహాయ పథకం కింద నిధులు అందడంలో జాప్యం జరుగుతోందంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మహిళలు నిరసనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. అనర్హతను కారణంగా చూపి బీజేపీ ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తోందని ఆమె ఆరోపించారు. ఎస్ఐఆర్ ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్లను తొలగించారని మండిపడ్డారు. తొలగించిన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చేందుకు అవసరమైతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని మమతా స్పష్టం చేశారు. మహిళలను ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ‘లక్ష్మీ భండార్’ పథకాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. కానీ, బీజేపీ ‘అన్నపూర్ణ భండార్’కు డబ్బు ఇచ్చేందుకు మతం, కులాన్ని ప్రాతిపదికగా వాడుకుంటోందని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు మహిళలందరికీ ‘అన్నపూర్ణ యోజన’ డబ్బు ఇస్తామన్న వాగ్దానాన్ని ఉల్లంఘించి ఇప్పుడు వారిని మోసం చేస్తోందని మమతా విమర్శలు గుప్పించారు. జాదవ్‌పూర్ యూనివర్శిటీలో ఏబీవీపీ, వామపక్ష విద్యార్థుల మధ్య ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో క్యాంపస్‌లో విధ్వంసానికి బీజేపీనే కారణమని ఆరోపించారు.

# తమిళనాడు అసెంబ్లీలో.. సీఎం విజయ్ సంచలన ప్రకటనలు

మెట్రో పాలిటన్, పట్టణ ప్రాంతాల్లోని ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లో.. మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించవచ్చు. సబర్బన్, కొండ ప్రాంతాల్లో తిరిగే సాధారణ ఛార్జీల బస్సులకూ ఇది వర్తిస్తుంది. ఈ పథకానికి ఏటా 6 వేల కోట్ల అదనపు భారం పడనుంది. అయితే, వార్షిక ఆదాయం రెండున్నర లక్షల్లోపు ఉన్న కోటి 30 లక్షల కుటుంబాలకు.. ఏడాదికి 3 ఉచిత ఎల్పీజీ సిలిండర్లు అందించనున్నారు. వీటి కొనుగోలు మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తారు. వచ్చే పొంగల్ నుంచి ప్రారంభం కానున్న ఈ పథకానికి.. ప్రభుత్వ ఖజానాపై ఏటా 4 వేల కోట్ల భారం పడనుంది. ఇక, రైతులు, స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని.. పరందూర్‌లో ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రజలు నిరాశ్రయులు కాకుండా.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత చెన్నై మీనంబాక్కం విమానాశ్రయంలో కొత్తగా టెర్మినల్-5ను నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు.

# ప్రధానిపై సీఎం రేవంత్ ఫైర్

తెలంగాణలోని 4 కోట్ల మంది ప్రజలను అవమాన పరిచే విధంగా కేంద్రం నిర్ణయం ఉందని సీఎం రేవంత్ అన్నారు. నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా కాకుండా.. గుజరాత్ ప్రధానిగా వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. అటు రాష్ట్రంలోని తెలంగాణ బీజేపీ లీడర్లు.. గుజరాత్ కు కట్టు బానిసలుగా వ్యవహ రిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. తెలంగాణపై ముమ్మా టికి కేంద్రం వివక్ష చూపించిందన్న రేవంత్. దీనిపై లోక్ సభ, రాజ్యసభలో చర్చ లేవనెత్తు తామని హెచ్చరించారు. తాను అమెరికా వెళ్తే.. గుజరాత్ కోరుకున్న పెట్టుబడులు రావన్న భయంతోనే తన పర్యటన అడ్డుకున్నారని రేవంత్ ఆరోపించారు. తను వెళ్లినప్పుడు వచ్చే రాజకీయ కారణాలు.. గుజరాత్ సీఎం విదేశాలకు వెళ్లినప్పుడు అడ్డురావా? అంటూ రేవంత్ నిలదీశారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యహరిస్తోందని మండిపడ్డారు. తనను ఆపగలిగినా.. తన లక్ష్యాలను మాత్రం ఎవరూ ఆపలేరన్నారు. తాను అధికారులను అమెరికా పంపించానని.. గ్లోబల్ సమ్మిట్ కు వారిని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ -- 2026 ను డిసెంబర్ 8,9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు తన పర్యటనను తిరస్కరించడమే కాకుండా బీజేపీ నేతలు రాజకీయంగా తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడాన్ని సీఎం రేవంత్ తప్పుబట్టారు. బీజేపీ నేతలు విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వైఖరిపై ప్రస్తుతం మాట్లాడదలుచుకోలేదని అన్నారు. అయితే ఇది రెండు ప్రభుత్వాలకు సంబంధించిన అంశంగా రేవంత్ అభివర్ణించారు. తన అమెరికా పర్యటనకు సంబంధించి పూర్తి వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు సమర్పించినా.. తిరస్కరించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు గుజరాతీ నాయకత్వం చేస్తున్న కుట్రగా దీనిని పేర్కొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక

మంగళవారం
25 -08-2026

# ప్రజావాణికి 103 ఫిర్యాదులు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి.



నిజామాబాద్, ఆగస్టు 24 ( ప్రజాగళం ప్రతినిధి ) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీ.పీ.

నిజామాబాద్, ఆగస్టు 24 ( ప్రజా గళం ప్రతినిధి) రాష్ట్ర గవర్నర్ సి.శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 10.20 గంటల సమయంలో నిజామాబాద్ కు చేరుకోనున్నారు. రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు గవర్నర్ కు స్వాగతం పలుకుతారు. అక్కడి నుండి కట్టుదిట్టమైన బందోబస్తు మధ్యన కాన్వాయ్ ద్వారా ఉదయం 11.00 గంటలకు భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ కు చేరుకుని, నషా ముక్త్ భారత్ అభియాన్ (యాంటీ డ్రగ్స్ అవగాహన) కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో సునహరీ మిట్టీ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని పసుపు రైతులతో భేటీ అవుతారు. కార్యక్రమం ముగిసిన అనంతరం డిచ్‌పల్లి మండలం బర్దిపూర్-ధర్మారం శివారులోని పీహెచ్‌ఆర్ కన్వెన్షన్ లో అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో గవర్నర్ పాల్గొనున్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటించనున్న ప్రతీ చోట పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీలు సమావేశమై గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రొటోకాల్ ను పాటిస్తూ గవర్నర్ పర్యటనకు ఎక్కడ కూడా ఏ దశలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మెడికల్ టీం, 108, 104, ప్రత్యేక డాక్టర్ల బృందంను అందుబాటులో ఉంచాలని, వేదిక, సీటింగ్ ను సరి చూసుకోవాలని, తాగునీరు, శానిటేషన్ పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులకు బాధ్యతలు పురమాయించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, గవర్నర్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే గవర్నర్ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు అనుమతిస్తామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# పోలీస్ ప్రజావాణిలో 32 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్.



నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 24 ( ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల ఎస్.ఐ, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్చందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని సీపీ వెల్లడించారు.వివిధ ఫిర్యాదు లకు సంబందించిన 32 ఫిర్యాదు లను స్వీకరించారు.

## ఎడపల్లిలో గుర్తుతెలియని వాహనం"ఢీ"కొని బర్రె మృతి.



ఎడపల్లి,ఆగస్టు 24: (ప్రజా గళం) ఎడపల్లి మండల కేంద్రంలో ని బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారిపై మేతకు వెళుతున్న బర్రెను సోమవారం ఉదయం గుర్తు తెలియని వాహనం"ఢీ"కొంది అని ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమ తెలిపారు.ఎస్ఐ తెలి పిన వివరాల ప్రకారం.. ఎడపల్లి గ్రామానికి చెందిన కంటేడి సంతోష్ పశు పోషకుడు చెందిన బర్రెలను ఈరోజు తీసుకెళుతుండగా నిజామాబాద్ నుండి బోధన్ వైపు అతి వేగంగా వెళుతున్న గుర్తుతెలియని మినీ వ్యాన్ ఢీకొంది.ఈ ఘటనలో బర్రెకు తీవ్ర గాయా లై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆమె తెలిపారు. మృతి చెందిన బర్రె సుమారు 60 వేల రూపాయలు ఉంటుందని బాధితుడు కంటేడి సంతోష్ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమ తెలిపారు.

## నేడు నిజామాబాద్ లో గవర్నర్ పర్యటన.

నిజామాబాద్ ఆగస్టు 24 ( ప్రజాగళం ప్రతినిధి ) రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ లో పర్యటించనున్నారు. దీనికి సంబంధించి అధికారిక షెడ్యూల్ ను ప్రకటించారు.ఉదయం 10.20 గంటలకు హెలికాప్టర్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ తో కలిసి గవర్నర్ నిజామాబాద్ ఐడీఓసీ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు..ఉదయం 11 గంటలకు భూమారెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు. మధ్యాహ్నం 12.15 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయానికి గవర్నర్. పసుపు రైతులతో సమావేశం లో పాల్గొంటారు. మార్కెట్ లింకేజీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న శివ ప్రతాప్ శుక్లా.మధ్యాహ్నం 1.50 గంటలకు పీహెచ్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ కార్యక్రమానికి హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3.20 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.



# అటవీ-శాఖ సిబ్బందికి నేర పరి-శోధన , కేసుల దర్యాప్తుపై ఒక్కరోజు శిక్షణ.

## పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడి.






నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 24( ప్రజా గళం): నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బందికి నేర పరిశోధన , కేసుల దర్యాప్తు , కోర్టు విచారణలో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన అంశాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం పోలీస్ కమీషనర్ కమాండ్ కంట్రోల్ హాల్ లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు , సిబ్బందికి కేసుల దర్యాప్తును శాస్త్రీయంగా , సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పూర్తి చేయాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దశ నుంచి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసే వరకు ప్రతి దశలో సత్వర చర్యలు తీసుకోవడం , నేరానికి సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం , నిందితులపై నేరం రుజువయ్యేలా పక్కా ఆధారాలను సేకరించడం వంటి అంశాలను వివరించారు. అలాగే భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 2023లోని దర్యాప్తు , సాక్షుల విచారణ , శోధనలు , కేసులను మేజిస్ట్రేట్‌కు పంపడం , దర్యాప్తు పూర్తయిన అనంతరం నివేదిక సమర్పించడం వంటి నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. బిఎన్ఎస్ఎస్ లో దర్యాప్తుకు సంబంధించిన సెక్షన్లు 176 నుంచి 193 వరకు , అలాగే సమన్లు , వారెంట్ల అమలుకు సంబంధించిన నిబంధనలు పొందుపరచబడ్డాయన్నారు. సాంకేతిక, శాస్త్రీయ ఆధారాల ప్రాధాన్యతపై కూడా ప్రత్యేకంగా వివరించారు. నేర స్థలంలో లభించే భౌతిక ఆధారాలు , డిజిటల్ ఆధారాలు , ఫోటోలు , వీడియోలు , సీసీటీవీ ఫుటేజీ తదితరాలను నిబంధనల ప్రకారం సేకరించి , వాటి సమగ్రతను కాపాడుతూ కేసు దర్యాప్తులో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేరానికి సంబంధించిన వస్తువులు , నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కు నిబంధనల ప్రకారం సురక్షితంగా పంపించడం, సరైన ప్యాకింగ్ , లేబులింగ్, సీల్, డాక్యుమెంటేషన్ , చైన్ ఆఫ్ కస్టడీ వంటి అంశాల్లో జాగ్రత్తలు పాటించడం ద్వారా కోర్టులో సాక్ష్యాల విలువను కాపాడుకోవాలని వివరించారు. అదేవిధంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సాక్షులకు సమన్లు, నిందితులకు వారెంట్లు సకాలంలో అమలు చేయడం, వాటి అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేయడం, కోర్టు విచారణకు అవసరమైన సాక్షులను సమయానికి హాజరు పరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కేసు నమోదు చేయడం మాత్రమే కాకుండా, నేరం కోర్టులో నిరూపితమై నిందితుడికి చట్ట ప్రకారం శిక్ష పడే విధంగా దర్యాప్తు నాణ్యతను పెంచుకోవడం ప్రతి దర్యాప్తు అధికారికి ప్రధాన లక్ష్యం కావాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, సూచించారు. అటవీ నేరాలకు సంబంధించిన కేసుల్లో పోలీస్ , అటవీశాఖల మధ్య సమన్వయం , శాస్త్రీయ దర్యాప్తు , సాంకేతిక పరిజ్ఞానం వినియోగం , న్యాయపరమైన ప్రక్రియలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా కేసుల దర్యాప్తు మరింత పటిష్టంగా , వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు, సాక్ష్యాల సేకరణ, ఎఫ్ ఎస్ ఎల్ నివేదికలు, కోర్టు ప్రక్రియలు, సమన్లు-వారెంట్ల అమలు తదితర అంశాలపై అటవీశాఖ సిబ్బందికి ప్రాయోగిక అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో సి.సి.ఆర్.బి ఏసిపి బి. గురు నాయుడు , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , మల్లేశం , ఎస్. ఐ జె. వరప్రసాద్ రెడ్డి , ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ బట్ మరియు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్స్ , ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటోడ్రైవర్ల బంద్ కు సంపూర్ణ మద్దతు.

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత.

నిజామాబాద్ ఆగస్టు 22 (ప్రజా గళం ప్రతినిధి )న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్లు ఈనెల 24 నుంచి తలపెట్టిన బంద్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. శనివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్టీయూ) సహా పలు ఆటో యూనియన్ ల నాయకులతో కలిసి బంద్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలు ఇచ్చి లాస్ట్ మైల్ కనెక్టివిటీ సర్వీస్ ప్రారంభించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ సర్వీస్ ను ఇప్పుడున్న ఆటోడ్రైవర్లతో నడిపించాలని డిమాండ్ చేశారు. ఆటో, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచా లని. ఓలా, ఉబర్, ర్యాపిడోలకు బదులుగా ప్రభుత్వమే యాప్ తీసుకురావాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు.




శిశువు మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కామారెడ్డి జీజీహెచ్ లో శిశువు మృతిపై ఎక్స్ (ట్విట్టర్)లో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసవం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన ఎక్కపల్లి తండాకు చెందిన గర్భిణికి సకాలంలో డెలివరీ చేయకపోవడంతోనే శిశువు మృతిచెందిందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు తరచు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. శిశువును కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
మంగళవారం
25 -08-2026

# నిజాయితీ చాటుకున్న దేగాం సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డి



ఆర్మూర్ ఆగస్టు 24 (ప్రజా గళం) ఆలూర్ మండలం బేగం సర్పంచ్ ఇత్తడి లింగారెడ్డి నిజాయితీని చాటుకున్నాడు. మచ్చర్ల గ్రామానికి చెందిన సింధుల సుమన్‌కు చెందిన పర్సు ఆదివారం రాత్రి పోగొట్టుకున్నాడు. పర్సులో సుమారు ఐదు వేల నగదుతో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ముఖ్యమైన డాక్యుమెంట్లు ఉన్నాయి. పర్సు పోవడంతో సుమన్ ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో దేగాం సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డికి ఉదయం వాకింగ్ చేస్తుండగా పర్సు లభించగా, అందులోని వివరాల ఆధారంగా యజమాని సింధుల సుమన్‌ను గుర్తించారు. అనంతరం పర్సులో ఉన్న నగదు, డాక్యుమెంట్లతో సహా సుమన్‌కు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా సుమన్ సర్పంచ్ లింగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పోగొట్టుకున్న పర్సును తన సొంత సొత్తుగా భావించకుండా, గుర్తించి తిరిగి అప్పగించడం ద్వారా సర్పంచ్ లింగారెడ్డి నిజాయితీ, మానవత్వాన్ని చాటుకున్నారని గ్రామస్థులు అభినందించారు.

# రాష్ట్రస్థాయి రోబ్ స్కిప్పింగ్ లో నిజామాబాద్ క్రీడాకారులు ప్రతిభకనబరిచారు.

**క్రీడాకారులను నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య అభినందించారు. : క్రీడాకారులకు మోడల్స్ అందజేశారు.**




నిజామాబాద్,ఆగస్ట్ 24,ప్రజాగళం: హైదరాబాద్ నగరం లో జరిగిన ఒక్క రోజు రోబ్ స్కిప్పింగ్ టోర్నమెంట్ కు నిజామాబాద్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్కా ఇంటర్నేషనల్ చైర్మెన్ తీర్మల్ రెడ్డి,IRSF చైర్మెన్ షా గుప్తా అంజుం,రోబ్ స్కిప్పింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాంచారి శ్రీనివాస్,కార్యదర్శి కృష్ణం రాజు ఇందులో పాల్గొన్నారు.రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను బొబ్బిలి నర్సయ్య అభినందించారు.నీ4అంతటా శిక్షణ చేస్తూ ఉన్నత దిశగా ముందుకు సాగాలన్నారు.ఎంచుకున్న క్రీడా రంగం లో రాణించి జాతీయ అంతర్జాతీయ రంగాలలో రాణించి దేశానికి,పుట్టిన ఉరికి,శిక్షకులకు మంచి పేరు తేవాలన్నారు

# ఫతేపూర్ లో స్లాబ్ దశలోనే సచివాలయ భవన నిర్మాణం.

## మూడు ఏండ్లుగా కొనసాగని పనులు. ప్రజాసేవ,పాలనకు ఆటంకం.

ఆర్మూర్,ఆగస్టు 22 (ప్రజాగళం) పాలకులు,ప్రజా ప్రతినిధులు మారిన ..ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు ..ప్రజా సేవకు,పాలనకు అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనం.ప్రజాపాలన అసౌకర్యంగా మారిన గ్రామ పంచాయతీ భవనం. ఆర్మూర్ మండలం ఫతేపూర్ గ్రామంలో మూడేళ్లుగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడం వల్ల స్థానిక పాలన,ప్రజా సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.ఇందువలన పాలకవర్గం సమావేశాలు నిర్వహించడానికి,ప్రజలకు సేవలు అందించడానికి సరైన వసతి లేక ప్రత్యామ్నాయలపై ఆధారపడుతున్నారు. గ్రామ పంచాయతీ భవనం లేక మహిళా భవనాన్ని వాడుకుంటున్నారు.మహిళా భవనంలోనే గ్రామపంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సేవలు,మహిళా సంఘ సమావేశాలు ఒకే భవనంలోనే నడుస్తున్నాయి.గ్రామపంచాయతీ కార్యాలయం లేక పంచాయతీ రికార్డుల భద్రతకు,అధికారుల రాకపోకలకు,ప్రజల సేవలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది.పాత గ్రామపంచాయతీ భవనాన్ని 2023వ సంవత్సరంలో కూల్చివేశారు.అదే సమయంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరైనాయి.సదరు కాంట్రాక్టర్ పిల్లర్లు,స్లాబ్ దశ వరకు నిర్మాణం జరిపాడు.మొత్తం 16 లక్షల రూపాయల్లో 11 లక్షల పైచిలుకు మొత్తానికి రికార్డులు చేయించి బిల్లులు తీసుకున్నాడు.మిగతా మొత్తం భవన నిర్మాణం పూర్తి కాకపోవడం,సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మిగతా నిధులు ప్రభుత్వ ఖాతాకు తిరిగి వెళ్ళిపోయాయి.అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణానికి గోడల నిర్మాణం,ప్లాస్టరింగ్ కు సుమారు రూ.10 లక్షల పైనే నిధులు మంజూరైతేనే నిర్మాణం పూర్తవుతుంది.సంబంధిత అధికారులు,జిల్లా కలెక్టర్ చొరవ చూపితే గ్రామపంచాయతీ భవనానికి నిధులు మంజూరు అవుతాయని గ్రామ ప్రజలు,సర్పంచ్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తి చేస్తాం.

ఏనుగు ప్రణుక నాగరాజ్.

అసంపూర్తిగా గ్రామపంచాయతీ భవన నిర్మాణం ఉండడం వాస్తవమే.నిధుల కొరత,గత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అసంపూర్తి భవనానికి కారణమన్నారు.సర్పంచ్ హోదాలో గ్రామ ప్రజలకు మేలు చేస్తాను.ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్,ఉన్నతాధికారులకు గ్రామ పాలకవర్గం,ప్రజలతో కలిసి వినతిని అందిస్తాం.స్థానిక ఎమ్మెల్యే,జిల్లా ఇంచార్జీ నాయకుల చొరవతో రూ.5 నుండి 10 లక్షలు మంజూరు చేయించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం.

# పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్య దారుణం.


## రక్షణ కల్పిస్తూ ప్రత్యేక పోలీస్ నోడల్ అధికారిని ప్రతి జిల్లాలో నియమించాలి.:నిజామాబాద్ నగరంలో ట్రస్మా నిరసన ర్యాలీ.




నిజామాబాద్ సిటీ ఆగస్టు 24 (ప్రజాగళం) నల్లగొండ జిల్లాలో పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిసున్నామని ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహ గౌడ్, జిల్లా అధ్యక్షులు నిత్యానందం అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలో ట్రస్మా ఆధ్వర్యంలో కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల ఉపాధ్యాయుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపి సాయి చైతన్య కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నల్లగొండ జిల్లాలో పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యకు గురైన సంఘటన విద్యా రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యాసంస్థలను నిర్వహిసూ సమాజానికి సేవ చేస్తున్న ఒక మహిళా పాఠశాల నిర్వాహకురాలు ఇలాంటి దారుణ ఘటనకు గురికావడం అత్యంత బాధాకరమని తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు. పాఠశాల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ప్రతిరోజు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం వల్ల విద్యా రంగంలో పనిచేస్తున్న వారిలో భయాందోళనలకు గురి చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ట్రస్మా తరపున కొన్ని డిమాండ్లను సిపి దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. రూపారెడ్డి హత్య కేసును అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి, నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసులో దర్యాప్తును వేగవంతం చేసి, నిజానిజాలను పూర్తిగా వెలికితీసి, బాధ్యులందరికీ కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ , గుర్తింపు పొందిన పాఠశాలల కరస్పాండెంట్లు, యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వద్ద, ముఖ్యంగా పాఠశాల యాజమాన్యాలు సిబ్బంది భద్రతకు అవసరమైన ప్రాంతాల్లో పోలీసు పర్యవేక్షణ, భద్రతా చర్యలను బలోపేతం చేయాలన్నారు. పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులు లేదా వేధింపులు జరిగినప్పుడు తక్షణమే స్పందించే ప్రత్యేక పోలీస్ నోడల్ అధికారిని ప్రతి జిల్లాలో నియమించాలి. విద్యాసంస్థల యాజమాన్యాలపై లేదా సిబ్బందిపై వచ్చే ఫిర్యాదులను చట్టపరమైన విధానంలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే చర్యలను అరికట్టాలన్నారు. పాఠశాలలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాల మధ్య పరస్పర గౌరవం, క్షమశిక్షణ భద్రతను పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనీ, ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రైవేట్ పాఠశాలల భద్రతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, స్పష్టమైన భద్రతా మార్గదర్శకాలను జారీ చేయాలన్నారు. విద్యా రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి జీవిత భద్రత, గౌరవం వృత్తిపరమైన స్వేచ్ఛకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలనీ, రూపారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన ఆర్థిక సహాయం అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ ఘటన ఒక్క కుటుంబానికి సంబంధించిన విషాదం మాత్రమే కాదనీ, విద్యా రంగంలో పనిచేస్తున్న ప్రతి యాజమాన్యం, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుని భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశమన్నారు. మా డిమాండ్లపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ట్రస్మా తరపున మనవి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహ గౌడ్, జిల్లా అధ్యక్షులు నిత్యానందం, జిల్లా సెక్రెటరీ అరుణ్, జిల్లా కోశాధికారి ఉప్పల మధు, నరసింహారావు, మోహన్, జనార్ధన్, పృధ్వి, పాఠశాల శ్రీనివాస్, నాగరాజు, రమేష్, ప్రభాదేవి, కవితా, ధర్మరాజు, రమేష్, ఇతర కరస్పాండెంట్లు, ట్రస్మా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు బకాయిలు విడుదల చేయాలని బీజేపీ నిరసన..



బాన్సువాడ, ప్రజాగళం. రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా బాన్సువాడ పట్టణంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోవడంతో దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బకాయిలు అందక చాలామంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేక చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి వారి చదువులు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చీదురు సాయిలు, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, కౌన్సిలర్ గజ్జల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఉమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు తృప్తి ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు గురుకుల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, చీకట్ల రాజు, పాశం భాస్కర్‌రెడ్డి, శ్యామల శ్రీకాంత్, కొండని గంగారం, పురుషోత్తం, సచిన్, సందీప్, మహేందర్, ఫణిందర్, భూమేష్, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com